సాక్షి చిత్తూరు

బుధవారం । 19 । మార్చి । 2025



అంగన్'వేడి'

అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడులు అమలుకాకపోవడంతో చిన్నారులు కేంద్రాల్లో ఇబ్బందులు పడ్డారు.

- 8లో



ఉద్యోగం కోసం వెళ్లి అంతమయ్యాడు

హైదరాబాద్‌లో యువకుడు మృతి చెందడంపై వెదురుకుప్పంలో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు.

- 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం (ఉ)
చిత్తూరు	6-29	4-58
పుంగనూరు	6-31	5-01

న్యూస్‌రీల్

మాతాశిశు సంరక్షణకు కృషి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : మాతా శిశు సంరక్షణను పకడ్బందీగా నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆశా నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణుల సేవలు పక్కాగా అమలు కావాలన్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. మాతా శిశు సంరక్షణకు కృషి చేయాలన్నారు. నిత్యం తల్లులతో పాటు పిల్లలను పర్యవేక్షణలో ఉంచాలన్నారు. క్రమం తప్పకుండా టీకాలు అందించాలన్నారు. ఎన్‌సీడీ సర్వేను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు, అధికారులు అనూష, ప్రవీణ, రామ్మోహన్, మూర్తి పాల్గొన్నారు.

రేపటి నుంచి వార్షిక తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్ : ట్రాన్స్‌కో పరిధిలోని డివిజన్ కార్యాలయాల నందు సాధారణ వార్షిక తనిఖీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా 20న పుంగనూరు డివిజన్ కార్యాలయం, 21 చిత్తూరు అర్బన్ డివిజన్, 22న చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయాల్లో తనిఖీలు ఉంటాయన్నారు. 25న ఎంఆర్‌టీ జిల్లా కార్యాలయంలో పరిశీలన నిర్వహించనున్నారు. ఎస్‌ఈ, టెక్నికల్ ఈఈ, పీఓ, ఏఓల బృందం ఫైల్స్, సబ్ స్టేషన్ల సరఫరా, ట్రిప్పింగ్ ఫైళ్లను పరిశీలించనున్నారు.

పల్లెలపై నిఘా పెట్టాలి



సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ చేస్తున్న అటవీశాఖ అధికారిణి

కుప్పం రూరల్ : అటవీ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని జిల్లా అటవీశాఖ అధికారిణి ఎస్.ధరణి ఆదేశించారు. మంగళవారం అటవీ సిబ్బంది యూనిఫామ్, షూ, బెల్టు, క్యాప్‌లు, టార్చ్‌లైట్లు, అగ్ని నిరోధక పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏనుగులు అటవీ ప్రాంతాల్లోకి వచ్చినప్పుడు సున్నితంగా మెలగాలని సూచించారు. ముందస్తు రైతులకు సమాచారం ఇచ్చి పొలాల వైపునకు రాకుండా నిత్యం నిఘా ఉంచాలన్నారు. వేసవిలో ఎక్కడా అడవిలో మంటలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేంజర్ జయశంకర్, సిబ్బంది ఉన్నారు.

ఎస్‌పీఎంలో పోలీసుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు పేరిట సాక్షి పత్రికలో సోమవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మంగళవారం ఈ మేరకు ట్రాన్స్‌కో ఏపీటీఎస్ (యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్) పోలీసులు విచారణ చేపట్టారు. చిత్తూరు లోని ఎస్‌పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం)ను పరిశీలించారు. అనంతరం పలు అంశాలపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. నూతన ఓఆర్‌ఎం (ఆయిల్ రీజనరేషన్ మిషన్) ఏర్పాటు చేసినప్పటికీ ఎందుకు ఇన్‌స్టాల్ చేయలేదు..? టెక్నీషియన్లు ఎందుకు రావడం లేదు...? వారంటీ గడువు ఎంత కాలం ఉంది..? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో మిషన్ అందుబాటులో ఉంటే ఉపయోగాలు ఏంటీ..? ఎప్పుడు మిషన్‌ను ఇన్‌స్టాల్ చేసే అవకాశం ఉంది..?అనే విషయాలపై చర్చించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం.

జేసీకి సావనీరు అందజేత



జేసీకి పుస్తకాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహస్థాపనను పురస్కరించుకుని ముద్రించిన పుస్తకం (సావనీరు)ను ఆ కమిటీ సభ్యులు జాయింట్ కలెక్టర్ విద్యాధరికి అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఆ విగ్రహ కమిటీ సభ్యులు జేసీని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆ కమిటీ సభ్యులు చిత్తూరు నగరంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి అంశాలపై జేసీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో విగ్రహస్థాపన కమిటీ సభ్యులు కట్టమంచి బాబీ, అమర్‌నాథ్, సహదేవ నాయుడు, అరుణకుమారి, రమేష్, శ్రీహరి పాల్గొన్నారు.

● చిత్తూరు నగరం వినాయకపురంలోని 41వ షాపులో రేషన్ ఇవ్వకుండా దోచుకుంటున్నారని కార్డుదారులు ఆందోళనకు దిగారు. షాపునకు వచ్చిన బియ్యాన్ని డీలర్ అలాగే బ్లాక్ మార్కెట్‌కు అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. రేషన్ అడిగితే కొందరికి కిలో రూ.10, రూ. 15 చొప్పున డబ్బులిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులకు 37 క్వింటాళ్ల తేడా ఉన్నట్లు గుర్తించారు. అలాగే చక్కెర 28 కిలోలు తక్కువగా వచ్చింది. దీంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు.

● చిత్తూరు నగరంలోని మురకంబట్టు ప్రాంతంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు కలిసి 101 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. ఓ ప్రైవేటు గదిలో అక్రమ రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అధికారులు ఆ గోడౌన్‌పై గుట్టు చప్పుడు కాకుండా దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 101 క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది. ఈ బియ్యాన్ని సీజ్ చేసి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు.

● చిత్తూరు నగరం మురకంబట్టు తిమ్మ సముద్రంలోని కోడిగుట్టలో కూటమిపార్టీకి చెందిన నేత ఇంట్లో రూ.1.24 లక్షలు విలువ చేసే 50 క్వింటాళ్ల బియ్యం నిల్వలను పోలీసులు గుర్తించారు. అక్రమ బియ్యంను స్వాధీనం చేసుకుని కూటమి నేతపై కేసు నమోదు చేశారు. ఈ వ్యక్తి తెల్లబియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి కర్ణాటక రాష్ట్రంలో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతడిపై 6ఏ కేసు నమోదు చేశారు.

● చిత్తూరు కైలాసపురంలో శ్మశాన వాటిక సమీపంలో ఉన్న గోదాములో రేషన్ బియ్యం పెద్ద ఎత్తున నిల్వ చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడులు చేపట్టిన పోలీసులకు 50 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

రేషన్ గద్దలు



- తెల్లబియ్యం.. సన్నబియ్యంగా రీసైక్లింగ్!
- రేషన్ మాఫియాగా కొందరు కూటమి నేతలు
- ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న వైనం
- ప్రతి నెలా రూ.లక్షల్లో దందా
- డీలర్ షాపుల నుంచే అక్రమాలు ఆరంభం
- 9 నెలల్లో 807.09 క్వింటాళ్ల బియ్యం పట్టివేత
- చోద్యం చూస్తున్న జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారులు

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం కొందరి కూటమి నేతల జేబులు నింపుతున్నాయి. ఈ దందాకు కొంత మంది రేషన్ డీలర్లే లోపాయికారిగా సహకరిస్తుండడంతో రేషన్ దందా రాష్ట్రం సరిహద్దులు దాటిపోతున్నాయి.. ఈ బియ్యం స్లైకింగ్ అయి తిరిగి సన్న బియ్యంగా మన మార్కెట్‌లోకి దూసుకొస్తున్నాయి. రేషన్ దందా ఇంత పెద్ద ఎత్తున సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు దారితీస్తోంది. ఇందులో ఎవరి వాటాలు వారికి ఉండడంతో రేషన్ దందా యథేచ్ఛగా సాగిపోతోందనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

కాణిపాకం : జిల్లాలో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి నేతలే అక్రమ వ్యాపారులుగా అవతారమెత్తి దందాను నడిపిస్తున్నారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. కార్డుదారుల నుంచి ఈ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ బియ్యం వ్యాపారులకు అధిక ధరకు విక్రయించి భారీగా లాభాలు ఆర్జిస్తున్నారు. పోలీసుల కంట్లో పడడంతో బియ్యం అక్రమ వ్యాపా రం బట్టబయలవుతోంది. 9 నెలల కాలంలో అక్రమంగా నిల్వలు, తరలిస్తున్న 807.9 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు మాత్రం అక్రమార్కులను పట్టుకోవడంలో వెనుకంజ వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 5.40 లక్షల మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా అందించేందుకు 15 వేల టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం జిల్లాకు కేటాయిస్తోంది. అయితే, రేషన్ తీసుకుంటున్న వారిలో 50 శాతం మంది బియ్యాన్ని వినియోగించడం లేదు. వాటిని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. చిరు వ్యాపారులు గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ పేదల నుంచి కిలో బియ్యాన్ని రూ.10 నుంచి రూ.17 వరకూ కొనుగోలు చేస్తున్నారు. వారు ఈ బియ్యాన్ని మిల్లర్లకు కేజీ రూ.20కు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. మిల్లర్లు ఇచ్చిన సొమ్ముతోనే చిరు వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని కోసం కిలోకు రూ.5 నుంచి రూ.10 వరకూ కమీషన్లలో మునిగి తేలుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రేషన్ దందా జిల్లాలో పెచ్చుమీరింది. కూటమి నేతలు కొందరు పేదల బియ్యాన్ని అక్రమ వ్యాపారంగా మలుచుకున్నారు. డైరెక్టుగా డీలర్‌లతో డీల్ కుదుర్చుకుని కూటమి నేతలు అక్రమ వ్యాపారాన్ని దర్జాగా నడిపిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటకకు తరలిస్తూ..లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు.

పోలీసులు పట్టుకుంటే.. పంచనామాకే పరిమితం

9 నెలల కాలంలో జిల్లా నలుమూల నుంచి భారీగా రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఈ మధ్య కాలంలో 28 కేసులు నమోదు కాగా 807.91 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బియ్యం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వెళుతున్న సమయంలో పోలీసులు పట్టుకుంటున్నారు. లేకుంటే స్థానికుల సమాచారంతో భారీ నిల్వలను గుర్తించి కేసులు పెడుతున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు ఈ వ్యవహారం తెలిసినా పట్టించుకోవడం లేదు. పోలీసులు పట్టుకున్నా కేసులు పెట్టేందుకు జంకుతున్నారు. కేవలం పంచనామా రాసి వెళ్లిపోతున్నారు. డీలర్ల నుంచే ఈ దందా నడుస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ మాఫియాపై కొరడా ఝుళిపిస్తేతప్ప దందా దాకు అడ్డుకట్ట పడదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సరిహద్దు ప్రాంతాలే..

అక్రమ రేషన్ వ్యాపారానికి జిల్లాలోని పలమనేరు, చిత్తూరు, బంగారుపాళ్యం, యాదమరి, గుడిపాల, జీడీనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, కార్వేటినగరం, నగరి, పుంగనూరు, కుప్పం, శాంతిపురం ప్రాంతాలు కేంద్ర బిందువుగా మారాయి. ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు లారీలు, ఆటోల ద్వారా యథేచ్ఛగా సరిహద్దులు దాటుతున్నాయి.



చిత్తూరు : తిమ్మసముద్రంలోని ఓ కూటమినేత ఇంట్లో పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

సన్నబియ్యంగా తిరిగీ మార్కెట్లోకి...

రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సన్న బియ్యంగా చూపుతున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసే రేషన్స్ బియ్యాన్ని సోనా మసూరి వంటి బ్రాండెడ్ బియ్యంలో కలిపి విక్రయిస్తున్నారు. సన్నంగా మర పట్టడంతో వినియోగదారులు గుర్తించలేక మోసపోతున్నారు. అటు తూకం దగ్గర సైతం ఇదే పరిస్థితి. 25 కిలోలు ఉండే ప్యాకెట్‌లో ఉండేది 23 కిలోలే. రెండు కిలోలు తరుగును చూపిస్తుంటారు. ఇటు బియ్యం నకిలీతో పాటు తూకంలో సైతం వినియోగదారుడు నష్టపోవాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా పౌర సరఫరాల శాఖ, తూనికలు కొలతలు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.



ఎవరు చేసినా వదిలిపెట్టం

రేషన్ దందా ఎవరు చేసిన వదిలిపెట్టం. కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటాం. డీలర్లు చేసినా కేసులు పెడుతాం. ఇప్పటికే చాలా కేసులు పెట్టాం. రేషన్ బియ్యంతో అక్ర మ వ్యాపారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలిపెట్టం. ఎక్కడైనా నిల్వలు ఉంటే చెప్పండి పట్టుకుంటాం. కేసులు పెడుతాం.

– శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

రేషన్ పట్టుకున్న వివరాలు ఇలా

నెల	6ఏ కేసులు	పట్టుబడ్డ బియ్యం క్వింటాళ్లల్లో..
జూన్ 2024	1	6.16
ఆగష్టు	8	131.9
సెప్టెంబర్	6	93.98
అక్టోబర్	1	24.1
నవంబర్	3	18.65
డిసెంబర్	4	316.56
ఫిబ్రవరి-25	3	110.99
మార్చి-25	2	104.57

జిల్లా సమాచారం

కార్డుదారుల సంఖ్య: 5.40 లక్షలు

బియ్యం సరఫరా ప్రతినెలా: 15 వేల టన్నులు

కిలో బియ్యం బయట అమ్ముతున్న ధర: రూ. 10 నుంచి రూ.17 వరకు

నెలనెలా అక్రమంగా వెళుతున్న బియ్యం: 5 వేల టన్నుల నుంచి 8 వేల టన్నుల వరకు

మిగులు ఇలా..

కార్డుదారులకు రేషన్ ఇవ్వకుండా, డీలర్లే డబ్బులకు విక్రయించడం

తూకంలో కోతలు, డబ్బాలు పెట్టి రేషన్ పంపిణీ

ఇంటింటికీ వెళ్లి రేషన్ సేకరించడం

19 మందికి డీటీలుగా పదోన్నతులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 19 మందికి డిప్యూటీ తహసీల్దార్‌లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టరేట్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో కొంత కాలంగా ఉద్యోగోన్నతి కోసం ఎదురుచూస్తున్న ఆర్‌ఐ, సీనియర్ అసిస్టెంట్‌లకు ఉద్యోగోన్నతి లభించింది. కలెక్టరేట్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు చిత్తూరు జిల్లాకు సంబంధించి యుగేష్ (కలెక్టర్ సీసీ, సివిల్ సప్లై కార్యాలయం సీనియర్ అసిస్టెంట్), రాజశేఖర్ (సీనియర్ అసిస్టెంట్), మోహన్ (సీనియర్ అసిస్టెంట్), నందిని దేవి (ఎంఆర్‌ఐ, పలమనేరు), రేఖ (సీనియర్ అసిస్టెంట్, చిత్తూరు), జోసఫ్ (సీనియర్ అసిస్టెంట్, చిత్తూరు), శిరీష (సీనియర్ అసిస్టెంట్, చిత్తూరు), సుధాకర్‌నాయక్ (ఎంఆర్‌ఐ, రొంపిచెర్ల), నరేంద్ర (ఎంఆర్‌ఐ, గంగవరం), శోభ (సీనియర్ అసిస్టెంట్, చిత్తూరు), మధుసూదన్ (ఎంఆర్‌ఐ, బంగారుపాళ్యం)లను, తిరుపతి జిల్లాకు సంబంధించి మాధవి (ఎస్‌ఏ, తిరుపతి), కృష్ణమ్మ (ఎంఆర్‌ఐ, ఆర్‌సీపురం), భాస్కర్ (ఎంఆర్‌ఐ, చంద్రగిరి), నాగరాజు (ఎంఆర్‌ఐ, తొట్టంబేడు), అన్నమయ్య జిల్లాకు చెందిన బాలాజీ (ఎంఆర్‌ఐ, పీటీఎం), చాణుక్య (ఎస్‌ఏ, అన్నమయ్య), మస్తాన్ కమలాకర్ (ఎస్‌ఏ, అన్నమయ్య), అనీషా (ఎంఆర్‌ఐ, మొలకలచెరువు) మొత్తం 19 మందికి డిప్యూటీ తహసీల్దార్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. త్వరలో వీరందరికీ పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేలా చర్యలు చేపడతున్నటుల డీఆర్‌ఓ మోహన్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఓటరు జాబితా కసరత్తుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఈ క్రమంలోనే ఎపిక్ కార్డులను ఆధార్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిబంధనలు, చట్టాల్లో అవసరమైన మార్పు చేర్పులకు రాజకీయ పార్టీల నుంచి సూచనలు స్వీకరిస్తున్నామన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. అలాగే నోటీసు ఇచ్చిన తర్వాతే మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. రెండు నియోజకవర్గాలలో ఓటు హక్కు కలిగి ఉన్నవారిని గుర్తించి, వెంటనే తొలగించాలని బీఎల్‌ఓలకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలో ఫారం 6,7,8 సంబంధించి 8,268 దరఖాస్తులు నమోదు కాగా 4,933 పరిష్కరించామని తెలిపారు. సమావేశంలో చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం, ఆర్డీఓలు శ్రీనివాసులు, భవానీ, భవానీ శంకరి, శ్రీనివాసులు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్, సిబ్బంది ఉమాపతి, మనోజ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్, అట్లూరి శ్రీనివాసులు, సురేంద్ర, యశ్వంత్, సుబ్రమణ్యం, లోకనాథం, గంగరాజు పాల్గొన్నారు.

తమ్ముళ్లు.. ఐపీఎస్ అనిపించారు

- జిల్లా పోలీసు బాస్ మెడపై 'పచ్చ'కత్తి..!
- చిత్తూరు జిల్లాలో రాజకీయ బదిలీలు
- జిల్లాలో 264 మంది పోలీసుల బదిలీ
- పుంగనూరు హత్యను ఆయుధంగా మలుచుకున్న కూటమి నేతలు
- పోలీసుశాఖలో రాజకీయ బదిలీలపై తీవ్ర చర్చ
- అసెంబ్లీ సమావేశాలైపోతే 'బాసు' బదిలీ?



పుంగనూరు పోలీస్‌స్టేషన్

చిత్తూరు అర్బన్/ పుంగనూరు : ''పుంగనూరులో మా కార్యకర్త (టీడీపీ) హత్యకు కారణం పోలీసులే. పోలీస్ స్టేషన్లలో గత ప్రభుత్వంలో పనిచేసిన వాళ్లు ఇంకా ఉన్నారు. వాళ్లను బదిలీ చేయమంటే ఎస్పీ ఒప్పుకోలేదు. అందుకే ఈ హత్య జరిగింది. దీనికి కారణం పోలీసు శాఖే'' అంటూ మూడు రోజుల కిందట కూటమి ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఇది ఏకంగా చిత్తూరు జిల్లా పోలీసు బాసు మెడపై కత్తిపెట్టి లొంగదీసుకునేంత పనిచేసింది. రెండు రోజులుగా చిత్తూరు పోలీసుశాఖలో ఏకంగా 264 మంది పోలీసులను ఉన్నట్టుండి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐలు ఉన్నారు. పుంగనూరులో జరిగిన హత్యా ఉదంతాన్ని అడ్డంపెట్టుకున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఐపీఎస్ అధికారిని లక్ష్యంగా చేసుకుని బహిరంగ వ్యాఖ్యలు చేయడంతో.. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ రాజకీయ బదిలీలు జరిగినట్లు స్పష్టమవుతోంది.

కూటమి పాలనలో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిత్తూరు జిల్లాలో ఆ పార్టీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు అన్నీ ఇన్నీ కావు. ఎస్పీ క్యాంపు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీల పన్నుల వసూలు బిల్డింగ్‌ను పెట్రోలు పోసి తగులబెట్టడం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు తెగబడటం సర్వసాధారణంగా చేసేశారు. తాజాగా పుంగనూరులో వెంకటరమణ, రామకృష్ణ ఇరువురు బంధువులే. వీరి మధ్య నెల కొన్న పాత గొడవలు రామకృష్ణ హత్యకు దారితీశాయి. ఈ ఘటనలో పోలీసుల వైఫల్యం కనిపిస్తున్నా, నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పుంగనూరు సీఐతో పాటు ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. పరిస్థితి అక్కడితో ఆగిపోలేదు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెల లు సమీపిస్తుంటే అన్ని ప్రభుత్వ విభాగాల్లో 'పచ్చ' ముద్ర వేసిన ఆ పార్టీ నేతలు.. పోలీసు శాఖలోనూ ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీ, ఏఎస్పీల్లో సామాజికవర్గం సాక్ష్యంగా బదిలీలు చేయించారు. కానీ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్‌ఐలోనూ తాము చెప్పిన వాళ్లను బదిలీ చేయాలని పోలీసు బాసుపై ఒత్తిడి తీసు కొచ్చారు. జిల్లాలోని ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఎవరు పనిచేయాలి..? అనే పేర్లతో కూడిన జాబితాను రూ పొందించారు. ఇందులో అన్నింటికీ ఒప్పుకోని పోలీ సు బాసు మెడపై పుంగనూరు హత్య ఘటనను ఆ యుధంగా ఉపయోగించారు. ఫలితంగా సోమ వారం 45 మంది, మంగళవారం 219 మంది సిబ్బందిని బదిలీ చేస్తూ చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల వ్యవధిలో ఏకంగా 264 మంది సిబ్బందిని బదిలీ చేయడం వెనుక కూటమి పార్టీ ఎమ్మెల్యేలు చక్రం తిప్పారన్నది సుస్పష్టం.

అసెంబ్లీ సమావేశాలు కాగానే..

అసెంబ్లీ సమావేశాలు పూర్తవగానే 'పోలీసు బాసు'ను కూడా జిల్లా నుంచి పంపించేస్తామని కూటమి నేతలు బహిరంగంగానే కార్యకర్తల వద్ద చెబుతున్నారు. బ్యూరోకాట్స్‌పై అధికారపార్టీ నాయకులు ఈస్థాయిలో ఒత్తిళ్లు చేస్తే ఎవరూ పని చేసే పరిస్థితులు ఉండవని ఉన్నతాధికారులు పెదవి విరుస్తున్నారు. ఇలాంటి ఘటనల వల్ల కొత్తగా వచ్చే అధికారులు సైతం చట్టానికి లోబడి కాకుండా.. తాము రూపొందించిన రెడ్‌బుక్ రాజ్యాంగానికి తదనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందని కూటమి నేతలు హెచ్చరికలు పంపించారు. మరోవైపు పుంగనూరు హత్యానంతరం అనంతపురం డీఐజీ షీమోషీ సైతం చిత్తూరులో ఉంటూ ఇక్కడి పరిస్థితులను చక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

పుంగనూరులో పోలీసులందరూ బదిలీ ...

పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న సీఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం హత్య కేసులో నిర్లక్ష్యం వహించారని సస్పెండ్ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐని అనంతపురానికి బదిలీ చేశారు. ఇక్కడ ఎస్‌ఐలు లేని కారణంగా ఆయనను కొనసాగిస్తున్నారు. కాగా ఎమ్మెల్యే ఆరిచారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఒక ఏఎస్‌ఐని, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లను కలిపి సుమారు 40 మంది పోలీసులను బదిలీ చేశారు. కాగా ఈ హత్య కేసులో వీరికి ఏమాత్రం సంబంధం లేకపోవడం గమనార్హం.

మేమేమి తప్పచేశాం...

అర్ధాంతరంగా బదిలీ అయిన పోలీస్ కుటుంబాల్లో మేమేమి తప్పు చేశాం.....మా భర్తలు ఏం తప్పు చేశారు... అర్ధాంతరంగా బదిలీలు చేస్తే మా పిల్లలు చదువులేంటి...మా కుటుంబంలోని వృద్ధులను ఎలా సంరక్షించాలి. ఉద్యోగులైన భార్యభర్తలకు కూడా అవకాశాలు కోల్పోయాం. తప్పు చేసిన వారితో పాటు మేము శిక్ష అనుభవించాలా అంటూ బదిలీ అయిన పోలీసు కుటుంబాల్లోని పలువురిలోనూ ఈ విధమైన ప్రశ్నలే వినపడుతున్నాయి. ఈ విషయమై జిల్లా ఎస్పీ మరోసారి పునరాలోచించాలి.

రేడియోగ్రాఫర్ పోస్టుల దరఖాస్తుకు గడువు పెంపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య విధాన పరిషత్‌లోని రేడియోగ్రాఫర్ పోస్టుల దరఖాస్తు గడువును పొడిగించినట్లు డీసీహెచ్‌ఎస్ ప్రభావతీదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ మేరకు దరఖాస్తులను ఈనెల 24వతేది వరకు స్వీకరించనున్నటువెల్లడించారు. అయితే రికార్డ్ అసిస్టెంట్ పోస్టును జాబితా నుంచి తొలగించినట్లు వివరించారు.

రీసర్వే పకడ్బందీగా చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న స్టేట్ నోడల్ ఆఫీసర్

పూతలపట్టు (కాణిపాకం) : రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని స్టేట్ నోడల్ ఆఫీసర్ గోవిందరావ్ ఆదేశించారు. పూతలపట్టు మండలం వడ్డేపల్లిలో పైలట్ ప్రాజెక్టు కింద జరుగుతున్న రీసర్వేను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రీసర్వే జరుగుతున్న విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే విషయాన్ని ముందుగానే భూయజమానులకు తెలియజేయాలన్నారు. రీసర్వేకు రాకుంటే నోటీసులు ఇవ్వాలని చెప్పారు. సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏడీ జయరాజు, రీసర్వే డీటీ మునిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక నిల్వలు సీజ్


ఇసుకను సీజ్ చేస్తున్న ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప, వీఆర్‌ఓ రమేష్

పాలసముద్రం : నరసింహపురం జగనన్న కాలనీ సమీపంలో డంప్ చేసిన ఇసుకను మంగళవారం ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప సీజ్ చేసి తహసీల్దార్ అరుణకుమారికి అప్పగించారు. ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప మాట్లాడుతూ.. నరసింహపురం పంచాయతీ జగనన్న కాలనీ సమీపంలో అనుమతి లేకుండా 15 లోడ్ల ఇసుక నిల్వలు ఉన్నాయని ఫిర్యాదు వచ్చిందన్నారు. వెంటనే వీఆర్‌ఓ రమేష్ సిబ్బందితో వెళ్లి ఇసుక నిల్వలను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించామని తెలిపారు.

నేటి నుంచి జిల్లాలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ముందస్తు కసరత్తు పూర్తి చేసింది. జిల్లాలో గుర్తించిన ప్రాంతాల్లో షెడ్యూల్ మేరకు బుధవారం నుంచి 22వ తేదీ వరకు, ఆ తర్వాత 25 నుంచి 28వ తేదీ వరకు స్పెషల్ క్యాంప్‌లను నిర్వహించనున్నారు. ఈ క్యాంప్‌లను జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు వెల్లడించారు. జిల్లాలో పుట్టినప్పటి నుంచి ఆధార్ కార్డుకు దరఖాస్తు చేసుకోని చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. జిల్లాలోని సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఈ ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నారు. ఆరేళ్ల వయస్సు లోపు చిన్నారుల పేర్లతో కొత్తగా ఆధార్‌కార్డు నమోదు, పాత కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

తీగ లాగితే.. డొంక కదిలింది!

- స్కూటర్ చోరీ కేసులో విచారిస్తే.. దోపిడీ దొంగలు దొరికారు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: తీగ లాగితే.. డొంక కదిలినట్టు.., ఓ ద్విచక్రవాహనం చోరీ కేసులో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు మోస్ట్ వాంటెడ్ దొంగలు దొరికారు. ఈ మేరకు గల్లా హేమచంద్ర (27), కొండరాజు సురేష్ (27), షేక్ మస్తాన్ (24), పోలి వరప్రసాద్ (20), సంజయ్ కుమార్ (23) అనే ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఒక్కొక్కరిపై 60, 57, 27 కేసులున్న కరు


సీజ్ చేసిన నగలను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

డుగట్టిన నేరగాళ్లతోపాటు.. రూ.35 లక్షల విలువైన బంగారు వెండి ఆభరణాలు పట్టుబడ్డాయి. మంగళవారం ఈ మేరకు చిత్తూరు నగరంలోని పోలీసు అతిథిగృహంలో ఎస్పీ మణికంఠ చందోలు, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, పూతలపట్టు సీఐ కృష్ణమోహన్‌తో కలిసి మీడియాకు వివరాలను వెల్లడించారు. ఈనెల 6వ తేదీన పూతలపట్టులో పార్కింగ్ చేసిన తన మోటారు సైకిల్ కనిపించడంలేదని బాధితుడు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని, లభించిన కొద్దిపాటి ఆధారాలతో దర్యాప్తు ప్రారంభించారు. తొలుత తవణంపల్లె మండలం జెట్టిపల్లె, పల్లెచెరువు పంచాయతీకు చెందిన గల్లా హేమచంద్రను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానితుడిపై చిత్తూరు, తిరుపతి, కడప, కర్నూలు, బద్వేలు ప్రాంతాల్లో దాదాపు 60కు పైగా కేసులు ఉన్నట్లు, అందులోనూ 20 కేసుల్లో నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ప్రకాశం జిల్లా సీఎస్ పురానికి చెందిన సురేష్ (ఇతడిపై 27 కేసులు), తిరుపతి జిల్లా పుత్తూరుకు చెందిన షేక్ మస్తాన్ (57 కేసులు), సత్యసాయి జిల్లా ఓడిసికి చెందిన వరప్రసాద్, చిత్తూరు రూరల్ మండలం తాళంబేడుకు చెందిన సంజయ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. ఇళ్లలో దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, ఆలయాల్లో హుండీల చోరీ, స్కూటర్లను అపహరించడం వంటి కేసుల్లో నిందితులు తప్పించుకుని తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులు చోరీలు చేసి దాచి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలు, 316 గ్రాముల బంగారు ఆభరణాలు, 3.150 కిలోల వెండి ఆభరణాలు, ఓ టీవీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరుతో పాటు ఇతర జిల్లాల్లో వీటిని చోరీ చేసినట్లు తెలిపారు. కేసు ఛేదించడంలో ప్రతిభ చూపించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఘనంగా ‘ప్రపంచ సోషల్ వర్క్ డే’

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ పి.తవితా తులసి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ సోషల్ వర్క్ డే ఘనంగా నిర్వహించారు. అకడమిక్ గాంధీయన్ స్టడీస్ ఈడీ గోపాల కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి ‘ఇంటర్ జనరేషనల్ సోలిడారిటీ క్రియేటింగ్ ఏ వరల్డ్ ఆఫ్ ఈక్వాలిటీ, జస్టిస్ అండ్ హ్యూమన్ రైట్స్ ఫర్ ఆల్’ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రగతి ఆర్గనైజేషన్ డైరెక్టర్ కేవీ రమణ, ఆంధ్ర బెస్ట్ విమెన్ అవార్డు గ్రహీత కమల, ప్రొఫెసర్ అనురాధ, డాక్టర్ లలిత కుమారి పాల్గొన్నారు. అలాగే ఎస్వీయూలో సోషల్ వర్క్‌డే నిర్వహించారు. ప్రిన్సిపల్ సుధారాణి, సెట్విన్ మేనేజర్ మోహన్, ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య, డాక్టర్ రీనా, డాక్టర్ సునీల్, డాక్టర్ కోదండరెడ్డి పాల్గొన్నారు.


సోషల్ వర్క్‌డేలో అధ్యాపకులు, విద్యార్థులు

‘రుణం ఇప్పిస్తామని మోసం చేశారు’

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : రుణం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ముగ్గురు మహిళలు తమ వద్ద నగలు, డబ్బు తీసుకొని మోసం చేశారని చిత్తూరు నగరం ఎంజీఆర్ వీధికి చెందిన ధనలక్ష్మి పేర్కొన్నారు. చిత్తూరు ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వ్యాపారం నిమిత్తం రుణం కోసం తాము ప్రయత్నిస్తుండగా.. ముగ్గురు మహిళలు రుణం ఇస్తామని మాయ మాటలు చెప్పి తమ వద్దనున్న రూ. 4 లక్షల విలువైన బంగారు నగలు, 4 లక్షలు నగదు తీసుకున్నారని చెప్పారు. నగలను వారి పేరిటే తాకట్టుపెట్టి డబ్బులు మాకు ఇవ్వకుండా వాళ్లే తీసుకున్నారని వాపోయారు. మా డబ్బులు, నగలు ఎప్పుడు ఇస్తావని ప్రశ్నించగా..ఆ మహిళలు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు

కాజూరు ప్రాంతానికి చెందిన దేవి మాట్లాడుతూ.. ఆ ముగ్గురు మహిళలు తనకు రూ.10 లక్షలు బ్యాంక్ రుణం ఇస్తామని చెప్పి, బ్యాంక్ డిపాజిట్ పేరుతో రూ.లక్షలు తీసుకున్నారని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు ఇచ్చామని అయితే ఇప్పటి వరకు కేసును నమోదు చేయలేదన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి వారిపై కేసులు నమోదు చేసి తమ నగదును రికవరీ చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి


మురగయ్య (ఫైల్)

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ గ్రామానికి చెందిన మురగయ్య చింతచెట్టుపై నుంచి కింద పడి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. బలిజకండ్రిగ గ్రామానికి చెందిన మురగయ్య(42) చింతపండ్ల కోసం చెట్టెక్కి అదుపు తప్పి కింద పడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో షోళింగర్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చెన్నై ఆస్పత్రికి తరలించగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

నీతి తప్పిన ఆ ఖాకీ ఎవరు..?

- చిత్తూరులోని పోలీసు అధికారిపై డీఐజీ ఆరా
- విచారణ చేస్తామని ప్రకటించిన ఎస్పీ
- అవినీతి ఆరోపణలపై కానిస్టేబుళ్ల బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని ఓ స్టేషన్‌ను అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చేసిన అధికారిపై అనంతపురం డీఐజీ షీమోషీ ఆరా తీస్తున్నారు. ఓ చోరీ కేసులో దొంగ నుంచి రూ.12.50 లక్షల లంచం తీసుకోవడం, డబ్బులు తీసుకుని కేసులు నమోదు చేయకపోవడం, పోలీస్ బాస్ తన ప్యాకెట్లో ఉన్నారని ప్రగల్భాలు పలికి అవినీతి కార్యకలాపాలు చేస్తున్న పోలీసు అధికారిపై ‘సాక్షి’ దినపత్రికలో మంగళవారం ‘కాసుక్కూర్చున్న ఖాకీ’ శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. చిత్తూరు పోలీసు అతిథి గృహంలో ఉన్న డీజీఐ షీమోషీ ఈ కథనంపై అధికారులతో చర్చించినట్లు సమాచారం. దొంగ నుంచి రూ.12.50 లక్షలు లంచం తీసుకున్నాడనే ఆరోపణలపై ఇప్పటికే విచారణ చేపట్టామని డీఐజీకు వివరించగా.. పత్రికలో వచ్చిన ఇతర ఆరోపణలపై కూడా విచారణ చేయాలని ఆమె ఆదేశించినట్లు తెలిసింది. మరోవైపు చిత్తూరులో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ.. అవినీతి ఆరోపణలు వచ్చిన అధికారిపై విచారణ జరుపుతున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ అధికారి చెప్పినట్లు చేసి, దొంగ నుంచి డబ్బులు తీసుకోవడంలో కీలకంగా వ్యవహరించారనే అవినీతి ఆరోపణలపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లోని ముగ్గురు సిబ్బందిపై బదిలీ వేటు పడింది. వీళ్లను ఆ పోలీస్ స్టేషన్ విధుల నుంచి తప్పిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఏకంగా పోలీస్ ‘బాస్’ పేరు చెప్పుకుంటూ పబ్బం గడుపుకుంటున్న ఆ అధికారి వ్యవహార శైలిపై జిల్లా పోలీసుశాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది.

పన్నుల వసూళ్లు.. పూర్

- ఆస్తి పన్ను వసూళ్లల్లో మున్సిపాలిటీలు వెనుకంజ
- పది రోజుల్లో ముగియనున్న గడువు
- రూ.కోట్లకు గానూ.. అరకొరగానే వసూళ్లు
- పన్నులు రాకుంటే అభివృద్ధికి గడ్డుపరిస్థితే !


చిత్తూరు నగరంలో పన్ను వసూళ్ల పై మాట్లాడుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్ : ఆస్తిపన్ను.. స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలకు ప్రాణవాయువు. కానీ ప్రస్తుతం జిల్లాలో ఆస్తి పన్ను వసూళ్లు మందకొడిగా సాగుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 12 రోజుల సమయం మాత్రమే ఉంది. చిత్తూరు కార్పొరేషన్‌తో పాటు మిగిలిన నాలుగు మున్సిపాలిటీల్లో ప్రభుత్వ భవనాలతో కలిసి లక్ష వరకు భవనాలున్నాయి. ఈనెలాఖరుకు పాత బకాయిలతో కలిసి మొత్తం రూ.62.63 కోట్లు వసూలు కావాల్సి ఉంటే.. మంగళవారం సాయంత్రానికి రూ.29.48 కోట్లు వసూలయ్యింది. కొన్ని చోట్ల కమిషనర్లు మున్సిపాలిటీ ఖజానాను బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలు ఆస్తి పన్ను వసూళ్ల ప్రభావంపై సానుకూలంగానే చూపిస్తోంది. అదే సమయంలో మరికొన్ని మున్సిపాలిటీలు పన్ను వసూళ్లపై అసలు ఏ మాత్రం దృష్టి పెట్టడంలేదని గణాంకాలే చెబుతున్నాయి. పన్ను వసూళ్లకు కొద్ది రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆశించిన స్థాయిలో ఏ మేరకు ఆస్తి పన్ను వసూళ్లవుతాయో అధికారులకు అర్థంకాని పరిస్థితి.

వడ్డీ మాఫీ చేస్తారని?

ఆస్తి పన్నుపై గత ప్రభుత్వం వడ్డీని మాఫీ చేసింది. ఈసారి కూడా వడ్డీ మాఫీ చేస్తే భారీ మొత్తంలో పన్నులు వసూలయ్యే అవకాశం ఉంది. ప్రజలపై పడిన అదనపు భారం కూడా తగ్గనుంది. వడ్డీ మాఫీ చేస్తారో..?లేదో..? అని ప్రజల్లో అనుమానాలు ఉండటం వసూళ్లపై ప్రభావం చూపిస్తోంది. ఇదే సమయంలో వసూలైన పన్నులు నేరుగా ప్రభుత్వ పీడీ ఖాతాలో జమ చేస్తుండటంతో అభివృద్ధి పనులకు ఈ మొత్తాన్ని వెచ్చించే వెసులుబాటు అధికారులకు, కౌన్సిల్‌కు ఉండటంలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో మున్సిపాలిటీల్లో విద్యుత్ బిల్లులు కూడా చెల్లించే పరిస్థితి ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లు ఇలా..

మున్సిపాలిటీ	భవనాలు	మొత్తం బకాయి	వసూలు (కోట్లలో..)
చిత్తూరు	44,879	రూ.39.60	రూ.16.97
పుంగనూరు	13,637	రూ.7.20	రూ.4.48
పలమనేరు	13,447	రూ.4.92	రూ.3.16
కుప్పం	12,998	రూ.6.38	రూ.2.51
నగరి	14,837	రూ.4.53	రూ.2.35

విశ్రాంత సబ్ పోస్టుమాస్టర్ అరెస్ట్

చౌడేపల్లె : చౌడేపల్లె పోస్టాఫీసులో గతంలో సబ్ పోస్టుమాస్టర్‌గా పనిచేసిన బి.భాస్కర్ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు ఇలా.. 2019 లో సబ్‌పోస్టు మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఖాతాదారులకు చెందిన నగదు దుర్వినియోగం చేశారన్నారు. ఆ విషయమై పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులు క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రిమాండుకు ఆదేశించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పుత్తూరు : పట్టణ పరిధిలో ఈనెల 9వ తేదీన చినరాజుకుప్పం గ్రామంలో జరిగిన బి.మణికంఠ(29) హత్య కేసులో నిందితుడైన బి.వెంకటేశులును అరెస్టు చేసినట్లు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు. మంగళవారం సీఐ మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా.. చినరాజుకుప్పం గ్రామానికి చెందిన బి.సుబ్బరాయులు, చెంచమ్మ కుమారుడు మణికంఠ ఈనెల 9వ తేదీన తన చిన్నాన్న వెంకటేశులు ఇంట్లో హత్యకు గురయ్యాడు. మృతుడు మణికంఠకు స్వయాన చిన్నాన్న అయిన బి.వెంకటేశులుతో కలసి తరచూ మద్యం తాగడం, గొడవ పడడం సాధారణ విషయంగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు భావించేవారు. పుట్టుకతో వికలాంగుడైన వెంకటేశులును మణికంఠ తరచూ హేళనగా మాట్లాడేవాడని, తరచూ కొడుతూ నిన్ను చంపేస్తే నీ ఆస్తి మొత్తం తనకు వస్తుందని చెప్పేవాడు. ఈ నేపథ్యంలో ఈనెల 9వ తేదీన వెంకటేశులు ఇంట్లో మద్యం తాగుతూ ఇద్దరి మధ్య గొడవ ప్రారంభమైంది. ఈక్రమంలో మణికంఠ.. వెంకటేశులును కొడుతూ తిట్టడం ప్రారంభించాడు. మణికంఠ మద్యం మత్తులో జోగుతున్న సమయంలో అతడి నుంచి తనకు ముప్పు పొంచి ఉందని భావించిన


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ

వెంకటేశులు తన వద్దనున్న రోకలిబండతో మనికంఠ తలపై బలంగా కొట్టడం జరిగింది. మనికంఠ మృతి చెందినట్లు భావించిన తర్వాత ఇంటి బయటకు వచ్చిన వెంకటేశులు ఏడుస్తూ కూర్చున్నాడు. అప్పుడే అక్కడికి వచ్చిన లావణ్య అనే గ్రామస్తురాలు రక్తపు మడుగులో పడి ఉన్న మనికంఠను చూసి కేకలు పెడుతూ అందరికీ చెప్పింది. దీంతో అక్కడి నుంచి వెంకటేశులు పరారయ్యాడు. మృతుడు తల్లి చెంచమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేసిన సీఐ సురేంద్రనాయుడు మంగళవారం నిందితుడు వెంకటేశులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

- కొమరగుంట యువకుడు హైదరాబాద్‌లో మృతి
- అనుమానాస్పద మృతిపై బంధువుల ఆందోళన
- కొమరగుంట క్రాస్ వద్ద రోడ్డుపై గ్రామస్తుల బైఠాయింపు

పోలీసులతో స్థానికుల వాగ్వాదం (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన మహేష్(ఫైల్)


ఉద్యోగం కోసం వెళ్లి అంతమయ్యాడు..!

వెదురుకుప్పం : ‘ఐటీ ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లాడు.. వివాహమై 14 నెలలు అవుతోంది. సంతోషంగా ఉన్నాడనుకున్నాం. అక్కడ ఏం జరిగిందో ఏమో శవమై తిరిగి వచ్చాడంటూ..’ మండలంలోని కొమరగుంట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల కథనం మేరకు.. కొమరగుంట గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు జి.మహేష్ (30)కి దామరకుప్పం గ్రామానికి చెందిన గుణవర్ధన్‌రెడ్డి కుమార్తె అనితకు 14 నెలల క్రితం ప్రేమించుకుని పెద్దల ఆమోదంతో వివాహం చేసుకున్నారు. మహేష్ భార్య అనిత సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తోంది. వీరు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం కొమరగుంటలో ఉన్న మహేష్ తండ్రి చంద్రశేఖర్‌రెడ్డికి ఫోన్ ద్వారా దిగ్భ్రాంతికర సమాచారం అందింది. ఉరి వేసుకుని చనిపోయినట్లు మహేష్ భార్య అనిత కుటుంబ సభ్యులకు తెలిపింది. ఆ సమాచారం అందిన వెంటనే కుప్పకూలిపోయారు. మహేష్ మృతి చెందడంతో భార్య అనిత అక్కడే పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి ఘటనను పరిశీలించి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి శవపరీక్ష కూడా నిర్వహించారు.

ఆనవాళ్లు లేకుండా చంపేశారు..బంధువుల ఆందోళన

ఘటనకు సంబంధించి కొమరగుంట గ్రామస్తులు మంగళవారం ఉదయం పచ్చికాపల్లం–పెనుమూరు ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున బైఠాయించారు. మహేష్‌ను పథకం ప్రకారం ఎలాంటి ఆనవాళ్లు కనిపించకుండా చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు ధర్నా చేపట్టారు. భార్య అనిత కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందంటూ.. అది ఆత్మహత్య కాదు.. హత్యగావించినట్లు బంధువులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మోహరించారు. ఈసందర్భంగా తమకు న్యాయం జరిగే వరకూ మేము ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని రోడ్డుపైనే భీష్మించుకూర్చున్నారు. పోలీసులు ఎంత సర్ది చెప్పినా వినిపించుకోలేదు. ఓ దశలో పోలీసులకు ఆందోళన కారులకు వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. పోలీసుల వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. సుమారు 3 గంటలకు పైగా ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం ఆందోళన చేస్తున్న సమయంలో శవం రావడంతో స్థానికులు మరింత కోపోద్రిక్తులై ఆందోళనను తీవ్ర తరం చేశారు. మృతదేహం వెంట భార్య అనిత రాకపోవడంతో అనుమానం మరింత బలమైంది. మృతదేహాన్ని పక్కన పెట్టి నిరసన తెలిపారు. ఇది ముమ్మాటికీ హత్యే అంటూ కుటుంబ సభ్యులు నినాదాలు చేశారు. ఎట్టకేలకు రెవెన్యూ, పోలీసు శాఖ సమన్వయంతో మధ్యాహ్నం కొమరగుంట గ్రామస్తులతో చర్చించి అనిత తరపున రావాల్సిన నగదు, బంగారాన్ని ఇచ్చేలా రాజీ కుదర్చడంతో ధర్నాను విరమింప చేశారు. ఈ ఆందోళనలో కానిస్టేబుల్‌కు గాయాలైనట్లు చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం కొమరగుంట సమీపంలో మహేష్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. హైదరాబాద్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదైనట్లు స్థానిక పోలీసులు పేర్కొన్నారు.

కృష్ణాపురం హత్యకేసు నిందితులకు రిమాండ్

పుంగనూరు : మండలంలోని కృష్ణాపురంలో తెలుగుదేశం కార్యకర్త రామకృష్ణను హత్య చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు పంపించారు. మంగళవారం ఇన్‌చార్జ్ సీఐ రామ్‌భూపాల్ ఆధ్వర్యంలో పోలీసులు నిందితులు ఏ1 వెంకటరమణ, ఏ5 రెడ్డెప్పరెడ్డిలను కోర్టుకు తీసుకొచ్చారు. న్యాయమూర్తి నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మదనపల్లె సబ్ జైలుకు తరలించారు.

అంగన్‘వేడి’

- అమలుకాని ఒంటిపూట బడులు
- అలసత్వంలో ఐసీడీఎస్ అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొన్న చిన్నారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులు మంగళవారం వేడిమి తాపానికి ఇబ్బందులు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 1795, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 625 ఉన్నాయి. వీటిల్లో 7 నెలల నుంచి 3 సంవత్సరాల వయస్సు ఉన్న బాలురు 28,783 మంది, బాలికలు 27,012 మంది, 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల వయస్సు గల బాలురు 17521, బాలికలు 17481 మొత్తం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,13,035 మంది చిన్నారులు చదువుకుంటున్నారు. జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువ ఉన్న విషయం విధితమే. ఎండలు ఎక్కువగా ఉండడంతో జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికే ఒంటిపూట బడులను అమలు చేస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మాత్రం ఒంటిపూట బడులను అమలు చేయని దుస్థితి నెలకొంది. దీంతో జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు వేడిమి ప్రతాపానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై రాష్ట్ర అంగన్‌వాడీ అధికారులు ఈనెల 18వ తేదీ (మంగళవారం) నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒంటి పూట బడులు అమలు చేయాలని జిల్లా అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చారు. అయితే ఆ ఆదేశాలు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు సరిగ్గా చేరవేయడంలో జిల్లా ఐసీడీఎస్ అధికారులు విఫలమయ్యారు. జిల్లా అధికారుల అలసత్వం కారణంగా పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి ప్రాంతాల్లో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పూర్తి రోజు నిర్వహించారు. ఈ విషయం పై జిల్లా ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరిని సంప్రదించగా ఉన్నతాధికారులు ఒంటిపూట బడులకు సంబంధించి వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ చేశారని, ఆ మెసేజ్ ను జిల్లా గ్రూప్‌లో ఫార్వర్డ్ చేసినట్లు తెలిపారు.